క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



నెల్లూరు(సెంట్రల్): నెల్లూరుకు విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డిని బుధవారం పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీని కలిసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు, తదితరులు ఉన్నారు.

టీబీ కేసులపై దృష్టి సారించండి



వైద్యాధికారితో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

ముత్తుకూరు : టీబీ బాధితులు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. ముత్తుకూరులోని ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వైద్య విభాగాన్ని, వాటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ చైతన్యరెడ్డి, ఇతర సిబ్బందితో మాట్లాడారు. టీబీ బాధితులున్న ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, గళ్ల పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కుష్ఠు, క్షయ రోగులకు ఇస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యాధుల పరీక్ష పరికరాల స్థితిగతులపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వెలిబుచ్చారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు ఆయన వెంట ఉన్నారు.

అవయవదానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు

- దేహదాత లక్ష్మీకాంతమ్మకు ఘనంగా నివాళి



మాట్లాడుతున్న డాక్టర్ ఎంవీ రమణయ్య

మనుబోలు : మరణానంతరం అవయవాలను దానం చేయడం ద్వారా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపొచ్చని నెల్లూరులోని రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల డాక్టర్ ఎంవీ రమణయ్య అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో ఇటీవల మరణించిన దేహదాత దివంగత కటికాల లక్ష్మీకాంతమ్మ సంస్మరణ సభను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తన కళ్లు, దేహంలోని ఇతర అవయవాలను దానం చేసిన లక్ష్మీకాంతమ్మ సేవాగుణాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఏసీ సుబ్బారెడ్డి మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ గీతాదేవి, జీజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా, సింహపురి దేహదాతల సంస్థ కన్వీనర్ సుకుమార్‌రెడ్డి, డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం ట్రెజరర్ బోగేశ్వరరావు, ఆలిండియా చేనేత సంఘ నేతలు శేషయ్య, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి ఆంజనేయులు

కోవూరు : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని రిటైర్డ్ జడ్జి ఆంజనేయులు తెలిపారు. కోవూరు మండలం నేతాజీనగర్‌లోని ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రధానంగా మరమ్మతులు అయిన వాటి స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా నిలిపివేతకు కాలపరిమితి లేకపోవడం, ఓల్టేజీ, బిల్లుల్లో లోపాలు వంటి వాటిపై ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ వేదికలో మొత్తం ఆరు ఫిర్యాదులు రాగా, వాటిని వేగంగా పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయకుమార్‌రెడ్డి, డీఈలు సతీష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సొంతింటి కల సాకారం



గిరిజన మహిళకు రూ.15 వేల చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే రాష్ట్రంలో పేదల సొంతింటి కల సాకారమవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. తోటపల్లిగూడూరు మండల పరిషత్ కార్యాలయంలో గిరిజనుల గృహ లబ్ధిదారులకు రూ.15 వేల అదనపు నగదు చెక్కులను మంత్రి కాకాణి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇంటి నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.80 లక్షలను మంజూరు చేయడంతో పాటు డ్వాక్రా గ్రూపుల నుంచి రూ.35 వేల రుణాన్ని అందిస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో వెనుకబడిన నియోజకవర్గంలోని గిరిజన కుటుంబాలకు మరింత ఆర్థిక చేయూత అందించాలనే ఉద్దేశంతో మరో రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని మొత్తం ఐదు మండలాల్లో గిరిజన గృహ లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ.2.28 కోట్ల అదనపు ఆర్థిక సాయాన్ని అందించినట్లు తెలిపారు. తోటపల్లిగూడూరు మండలానికి సంబంధించి మూడు విడతల్లో 304 మంది గిరిజన గృహ లబ్ధిదారులకు రూ.45.60 లక్షల ఆర్థిక సాయం అందించామన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నేతలు కోర్టులకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. వారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు పక్కా ఇంటిని నిర్మిస్తున్నామన్నారు. అనంతరం మండలానికి మంజూరైన 900 ఉచిత గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు మంత్రి కాకాణి అందజేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, వైస్ ఎంపీపీలు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, కంజి నీలమ్మ, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, పార్టీ నేతలు కావల్‌రెడ్డి రంగారెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్, తలమంచి సురేంద్రబాబు, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, నెల్లిపూడి సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి రప్పించేలా చర్యలు

- కలెక్టర్ హరినారాయణన్



చెముడుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వివరాలపై ఆరాతీస్తున్న కలెక్టర్

వెంకటాచలం : గ్రామాల్లో బడి బయట ఉన్న డ్రాప్ అవుట్ పిల్లలందరూ బడికి వచ్చేలా ఉపాధ్యాయులు, గ్రామ సంక్షేమ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. మండలంలోని చెముడుగుంట, కసుమూరు గ్రామాల్లో బుధవారం కలెక్టర్ పర్యటించారు. తొలుత చెముడుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించి, 12 మంది టీచర్లు, ఉండగా విద్యార్థులు 216 మంది మాత్రమే ఎందుకు ఉన్నారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఉపాధ్యాయులు, సంక్షేమ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకుని బడి బయట పిల్లలను తప్పనిసరిగా బడికి వచ్చేలా చూడాలని ఆదేశించారు. డ్రాప్‌అవుట్స్ గురించి సంక్షేమ కార్యదర్శి సరైన సమాచారం ఇవ్వకపోవడంతో బాధ్యతగా పనిచేయాలని మందలించారు. అనంతరం చెముడుగుంట, కుంకుమపూడి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కుంకుమపూడి అంగన్‌వాడీ వర్కర్ సక్రమంగా రిజిస్టర్ నిర్వహించకపోవడంతో ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్ల రిజిస్టర్ సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో ఎందుకు పరిశీలన చేయడం లేదని సీడీపీఓపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి కసుమూరు పంచాయతీ పరిధిలో కొండ కింద కాలనీ వద్ద ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీరును పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఆయన వెంట డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీఎంహెచ్ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న పోర్టు ప్రతినిధులు

ముత్తుకూరు : ముత్తుకూరు, కృష్ణపట్నం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తామని అదాని ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్‌రంజన్ అన్నారు. అదాని కృష్ణపట్నం పోర్టులో కృష్ణపట్నం హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైస్కూల్‌కు అవసరమైన మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, నివేదిక అందజేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి ఫౌండేషన్ సహకరిస్తుందన్నారు. అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ అఫైర్స్ జీఎం మృత్యుంజయ్‌రామ్, రమేష్‌బాబు, అరుణ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం



మాట్లాడుతున్న సురేష్

ఇందుకూరుపేట : బాల్య వివాహాల వల్ల ఆరోగ్యానికి అనర్థం అని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ అన్నారు. మండలంలోని మైపాడు ఎస్టీకాలనీలో బాల్యవివాహాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సంరక్షణ సభ్యులు శ్రీనివాస్, చైతన్యజ్యోతి వెల్ఫేర్ ప్రతినిధి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వజ్రమ్మ

మనుబోలు : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గుండాల వజ్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలన్నారు. వ్యవసాయాధికారి జహీర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులకు ఎటువంటి కొరత లేదన్నారు. హౌసింగ్ ఏఈ రవికుమార్ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామన్నారు. డీటీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రీసర్వేతో ఎంతో కాలంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి తదితర అధికారులు వారి శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఏపీఎం వనజాక్షి, ఏపీఓ రాజమ్మ, మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీలు శిరీష, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పుస్తక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పుస్తక పఠనంతో మానసిక వికాసం కలుగుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత టి.వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుస్తక పఠనం నిత్య జీవితంలో భాగం కావాలన్నారు. పుస్తక పఠనంతో అపారమైన జ్ఞానం లభిస్తుందని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.మంజులత, ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ఇందుకూరుపేట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మైపాడు శాఖ గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. సర్పంచ్ సంగం వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొని, పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. లైబ్రేరియన్ ఆర్.నాగరాజు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఉన్నత స్థానాలకు..

విడవలూరు : మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, పుస్తక పఠన ప్రాముఖ్యతను స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర, ఎన్జీఓ శేఖర్ పాల్గొని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం లైబ్రేరియన్ టి.నిరూప మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

మనుబోలు : పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని మనుబోలు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రమాదేవి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వాసిలి అరుణ్‌కుమార్, ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య ఉన్నారు.

గ్రంథాలయాభివృద్ధికి సహకారం

కొడవలూరు : గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని సామాజిక కార్యకర్త ఉదయగిరి మనోహర్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా యల్లాయపాళెం శాఖా గ్రంథాలయంలో సామాజిక కార్యకర్త మనోహర్‌ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాలు, ఫర్నిచర్ తదితరాలకు పూర్తి సహకారమందిస్తానన్నారు. లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కొడవలూరులో పుస్తక ప్రదర్శన

కొడవలూరు శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, ఉపాధ్యాయుడు నారాయణరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ పుస్తక ప్రదర్శనను సందర్శించి మాదక ద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ కె.రాజేశ్వరి పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు



విడవలూరులో..



మనుబోలులో..



కొడవలూరు : యల్లాయపాళెం గ్రంథాలయంలో..



కొడవలూరు గ్రంథాలయంలో..

గ్రామాల్లో ప్రగతి పరుగులు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న, ఇతర నాయకులు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో ప్రగతి పరుగులు పెడుతున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని రేబాలలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్న పాల్గొన్నారు. మొదట సచివాలయం-1 దగ్గర సంక్షేమ పథకాల బ్యానర్‌ను, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేబాల గ్రామంలోని సచివాలయం-1, సచివాలయం-2 పరిధిలో ఇప్పటివరకు వివిధ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.24.28 కోట్ల నిధులు అందాయని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ద్వారా ఇంతలా లబ్ధి చేకూరలేదని వెల్లడించారు.

మంజూరు పత్రాల అందజేత

కార్యక్రమంలో భాగంగా ఎంపీ లాడ్స్ ద్వారా మండలంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైన పత్రాలను సంబంధిత ప్రాంత అధికారులు, నాయకులకు ఎమ్మెల్యే ప్రసన్న అందించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ 12వ వార్డులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత పత్రాన్ని ఆ వార్డు కౌన్సిలర్ యానాదిరెడ్డికి అందజేశారు. అలాగే 16వ వార్డులో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల నిధులను ఎంపీ విజయసాయిరెడ్డి మంజూరు చేశారు. సంబంధిత పత్రాలను 16వ వార్డు కౌన్సిలర్ నస్రీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీహెచ్ సతీష్‌రెడ్డి, ఎంపీపీ ఎం.శ్రీనివాసులు, సర్పంచ్ ఎల్.భాగ్యలక్ష్మి, పార్టీ నేత యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూహక్కు పత్రాల పంపిణీ



సర్వేపల్లి నియోజకవర్గ తహసీల్దార్లతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన వారికి భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని మండలాల తహసీల్దార్లతో సమావేశమయ్యారు. భూహక్కు పత్రాల పంపిణీపై దిశా నిర్దేశం చేశారు. 2023 నుంచి భూములను అనుభవిస్తున్న వారికి, అసైన్‌మెంట్ కమిటీ ఎంపిక చేసిన లబ్ధిదారులు, ఇనాం భూములు సాగు చేసుకుంటున్న వారికి, చుక్కల భూములు, 22ఏ జాబితాలోని భూములకు సంబంధించిన రైతులకు భూహక్కు పత్రాలు అందజేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు చేపట్టారు. జిల్లాలో సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించే మొట్టమొదటగా భూహక్కు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 17న పొదలకూరులో నిర్వహించనున్న పట్టాల పంపిణీ కార్యక్రమానికి తహసీల్దార్లు సిద్ధంగా ఉండాలన్నారు.

జరిగిన మేలును ప్రజలకు వివరించాలి



విడవలూరు : వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు



కొడవలూరు: గండవరంలో..

- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల వెల్లడి

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలును క్షేత్రస్థాయిలో వివరించాలని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. కోవూరు సచివాలయం-4 పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎలాంటి అక్రమాలు జరిగాయో ప్రజలకు వివరించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి మార్పులు వచ్చాయో తెలియజేయాలని సూచించారు. రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చౌకచర్ల గ్రామంలో..

విడవలూరు : మండలంలోని చౌకచర్ల గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం స్థానిక సర్పంచ్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. తొలుత వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డితో పాటు పార్టీ నేతలు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, స్థానిక నేత పాశం శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని వలంటీర్లు, గృహసారథులు ప్రతి గడపకు వెళ్లి గడిచిన నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల గురించి తెలియజేసి, మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆదరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నారాయణ శాస్త్రి, ఏఓ దశరదరామిరెడ్డి, వైస్ ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి

కొడవలూరు : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ నేత అడపాల మోహనకృష్ణ అన్నారు. మండలంలోని గండవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గడిచిన నాలుగున్నరేళ్లలో గండవరంలో సంక్షేమం ద్వారా రూ.22.14 కోట్ల లబ్ధి చేకూరగా, రూ.1.72 కోట్లకు అభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం అధికారులతో కలిసి స్థానిక సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ జి.జ్యోతి, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, ముజీర్, ఐ.సునీల్‌రెడ్డి, ఎం.రంగారెడ్డి, సీహెచ్.మనోహర్, ఎం.నరసారెడ్డి, ఈఓపీఆర్డీ డేవిడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు



వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన ఆకాశదీపం

పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలను నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం కార్తీక దీపాలను వెలిగించారు. ఆకాశ దీపంలో నూనెపోసి భక్తిని చాటుకున్నారు. దేవస్థానం నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మరుపూరులో పూజలు

మండలంలోని మరుపూరులో ఉన్న కామాక్షి సమేత మల్లికార్జున స్వామి(శివాలయం) ఆలయంలో ఆకాశదీపాన్ని ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు. మహిళలు దేవస్థానం ప్రాంగణంలో బుధవారం కార్తీక దీపాలను వెలిగించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామపెద్ద, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి కార్తీక మాసం సందర్భంగా బుధవారం లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ గిరికృష్ణ, చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.